క్లుప్తంగా

వైఎస్సార్‌బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణానికి చెందిన సచివాలయం–2 పరిధిలో నివాసం ఉంటున్న షేక్ అల్లాబకాష్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం సచివాలయ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను వలంటీర్ జి.ప్రశాంతితో కలిసి అందజేశారు. వైఎస్సార్ బీమా మిగిలిన రూ.90వేల త్వరలో మంజూరువుతుందని సెక్రటరీ తెలిపారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ఎండలు మండుతున్నందున వడదెబ్బసోకే అవకాశాలు ఉన్నాయని, ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని రేవనూరు గ్రామ సమీపంలో శనివారం జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశానికి డాక్టర్ వెళ్లి కూలీలతో మాట్లాడారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. నీడ ప్రదేశంలో పనులు చేసుకోవాలని, తరుచూ నీరు తాగుతూ ఉండాలని సూచించారు. అనంతరం కూలీలకు వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, వీరభ్రదుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ భూమి పూజ ఏర్పాట్ల పరిశీలన

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో ప్రజల సౌకర్యార్థం రామ్‌కో సిమెంట్ రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఫంక్షన్ హాల్ నిర్మించనున్న విషయం తెలిసిందే. సోమవారం భూమి పూజ చేయనున్న నేపథ్యంలో శనివారం రామ్‌కో సిమెంట్ ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్ పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరు కానున్నారు.

23నుంచి ఆధార్ క్యాంప్‌లు

కొలిమిగుండ్ల: మండలంలో ఈనెల 23 నుంచి మొబైల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు శనివారం తెలిపారు. 23, 24 తేదీల్లో బెలుం సచివాలయంలో, 25న బెలుం శింగవరం పంచాయతీలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా 30, 31 తేదీల్లో తుమ్మలపెంట సచివాలయం పరిధిలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారికి, 5–15 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ సర్వీస్ సైతం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్‌లో అప్‌డేట్, అడ్రస్, మొబైల్ నంబర్ మార్పునకు రూ.50 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొబైల్ ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామతీర్థం శేషు



బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురానికి చెందిన రామతీర్థం శేషును మాదిగ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణ మాదిగ ప్రకటించారు. మందాకృష్ణ మాదిగ అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని, అందరిని ఐకమత్యం చేసి ఎస్సీ వర్గీకరణ సాధనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా శేషు తెలిపారు.

శ్రీచైతన్య, నారాయణ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులను నిర్వహిస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరవక ముందే క్లాసులు నిర్వహిస్తు అక్రమ అడ్మిషన్లను ప్రైవేట్ విద్యా సంస్థలు తలుపులు తెరచాయని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, స్కూల్ బస్సుల పేరిటి అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏలాంటి చర్యలు లేవన్నారు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద వ్యక్తిగత మనస్పర్థలతో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసి గాయపరచిన సంఘటన చోటు చేసుకుంది. హనమాన్ నగర్ కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డి బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర ఉన్న మాబుసుభాన్‌తో గొడవ పెట్టుకుని దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగమయ్య శనివారం తెలిపారు.

‘పది’ పరీక్షలకు మరో అవకాశం

- రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఇంటర్ చదువుకునేలా వెసలుబాటు
- రెమిడియల్ తరగతులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు
- జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



బాలుర ఉన్నత పాఠశాలలో రెమిడియల్ క్లాసు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

ప్యాపిలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. జూన్‌లో 2 వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఇంటర్ చదువుకునే వెసలుబాటు ఇచ్చింది. ఇందు కోసం ఈ నెల 10వ తేదీ నుంచి ఉన్నత పాఠశాలల్లో రెమిడియల్ క్లాసుల పేరిట ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరవుతూ విద్యార్థులను చదివిస్తున్నారు. మండలంలో మొత్తం 11 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలలకు చెందిన 667 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 332 మంది పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తోంది. ఈ తరగతులకు హాజరవ్వని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. తల్లిదండ్రులకు ఫోన్ చేసి తరగతులకు పంపవలసిందిగా సూచిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

సబ్జెక్టుల వారీగా తరగతులు



ప్రతి పాఠశాలలో సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితా సిద్ధం చేశాం. ఈ మేరకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు సదరు పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి టైంటేబుల్ సిద్ధం చేసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఉన్న సందేహాలను ఉపాధ్యాయులు తీరుస్తున్నారు. ఏడాది వృథా కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని పది తప్పిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీనివాసులు, ఎంఈఓ

విద్యార్థులను తప్పనిసరిగా పంపాలి



పాఠశాలలో మొత్తం 92 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. అయితే తరగతులకు తక్కువ మంది హాజరు అవుతున్నారు. ఈ విషయాన్ని ప్రతి రోజు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెబుతున్నాం. ఉపాధ్యాయులు ప్రతిరోజు వచ్చి వారి సబ్జెక్టు బోధిస్తున్నారు. – మధుసూదన శర్మ, హెచ్ఎం, బాలుర ఉన్నత పాఠశాల, ప్యాపిలి

స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాలి



చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను అంకితం చేసిన సమర యోధులను విస్మరించరాదని, ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మధు తెలిపారు స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, స్వాతంత్ర్య సమరయోధుడు బీపీన్ చంద్రపాల్ వర్ధంతిని పురష్కరించుకుని శనివారం స్థానిక కార్యాలయంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఓ మహిళ కుటుంబానికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని శంకలాపురం మజార గ్రామమైన బైనపల్లెలో శనివారం ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎంపీపీ, చైర్మన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి కొత్త పాలనకు శ్రీకారం చుట్టారని, నేరుగా సేవలు అందజేస్తున్నారన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాలకు సైతం బీటీ రోడ్డు వేయడం జరిగిందని, ప్రతి కుటుంబానికి ఏదోవిధంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్ నాయకులు రమణారెడ్డి, శేషిరెడ్డి, కొండారెడ్డి, గూని నాగరాజు, శేఖరయ్య, నాగేశ్వరరావు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ, సీతారామాపురం సర్పంచ్‌లు వేణుగోపాలు రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవాలా అంటూ మాజీ సీఎం చంద్ర బాబు నాయుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చిన నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి స్వగృహం నుంచి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు యాకోబ్, భాస్కర్, రంగస్వామి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా పాతబస్టాండ్ చేరుకుని బాబుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అమరావతిలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసే విషయంపై సెంటు స్థలం సమాధులు కట్టుకోవడానికి కూడా సరిపోదని బాబు అనడం భావ్యం కాదన్నారు. 14 సంవత్సరాలు సీఎం ఉన్న చంద్రబాబు నాయుడు పేద దళితుల సంక్షేమం గురించి ఏనాడైనా ఆలోచించారా... సెంటు భూమిని ఇచ్చారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని, దిక్కుతోచక వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అదేవిధంగా బేతంచెర్ల మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామం రైతుల విన్నపం మేరకు పొలాలకు రహదారి వేస్తుంటే మంత్రి బుగ్గనపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సబబు కాదన్నారు. 30 సంవత్సరాల్లో ఎప్పుడూ జరగని అభివృద్ధిని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో మూడేళ్లలోనే చేసి చూపిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, శేఖరయ్య, దస్తగిరి, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నడ్డి శ్రీను, రమేష్, ఎద్దులన్న, ఆకులరమణ, కిరణ్, నిరంజన్, రామనాయుడు, శేషు, హరి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

బనగానపల్లెరూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి 104 ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించారు. జీఓ నెంబరు 4459 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయర్ కాంట్రీబ్యూషన్ అరబిందో యాజమాన్యమే చెల్లించాలని, స్థానిక ప్రదేశాలకు బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాటసాని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకర్గంలోని 104 ఉద్యోగులు ప్రసాద్, గోపాల్, ఇంద్రుడు, భాస్కర్, వరప్రసాద్, షేక్షావలి, దీపక్‌కుమార్, పిటిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులకు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆవోపా సంఘం కార్యదర్శి జోన్నల గడ్డ శ్రీనివాసులశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు ఫొటోతోపాటు మార్కులిస్టు జిరాక్స్ కాపీని అందజేయాలని, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయంతోపాటు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా నిషేధించాలని డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయ ఆవరణలో శనివారం పర్యావరణహిత జీవన విధానంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు. చెట్ల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణారెడ్డి, శివశంకర్, మౌలాలీ, భారతి, సునిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



చెర్లోపల్లె సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జనార్దన్ రావు

అవుకు: సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీఎల్‌డీఓ జనార్దన్ రావు సూచించారు. అవుకు మండలంలోని రామాపురం(1, 2), చెర్లోపల్లె గ్రామ సచివాలయాలను, రైతుభరోసా కేంద్రాలను ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్‌తో కలిసి డీఎల్‌డీఓ తనిఖీ చేశారు. అటెండెన్స్, మూవ్‌మెంట్ తదితర రికార్డులను పరిశీలించారు. రామాపురం–1 గ్రామ సచివాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌పై డీఎల్‌డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఈ సందర్భంగా డీఎల్‌డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సిబ్బంది రామ్మోహన్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సిబ్బందికి సన్మానం



టెక్నికల్ అసిస్టెంట్లను సన్మానిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలో ఉపాధి పథకంలో పనిచేస్తూ బదిలీ అయిన టెక్నికల్ అసిస్టెంట్లను శనివారం ఘనంగా సన్మానించారు. టీఏలుగా విధులు నిర్వర్తిస్తున్న వీరప్ప, రాంబాబు, కొండయ్య, శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్ శివరామిరెడ్డి వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెలగటూరు, గుంజలపాడు గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్లు జయభరత్‌రెడ్డి, పక్రుద్దీన్, రాధాదేవి, ఈసీ మగ్బుల్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి సన్మానం

కొలిమిగుండ్ల: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన సిబ్బందిని శనివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కంప్యూటర్ ఆపరేటర్లు శివాంజనేయులు, రమేష్ బాబు విజయనగరం జిల్లాకు, సుబ్రహ్మణ్యం పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు కొండారెడ్డి, ఓబులేసు అనకాపల్లి, కాకినాడకు, చెన్నయ్య విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. వీరిని ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఓ గంగన్నతో పాటు తోటి సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు.

గాలి, వాన బీభత్సం

కోవెలకుంట్ల: వేసవికాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండి రాత్రికంతా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. శనివారం రాత్రి స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో గాలి, వాన బీభత్సం సృష్టించింది. స్థానిక నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారితోపాటు మండలంలోని రేవనూరు సమీపంలో పెనుగాలులకు చెట్టు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో గంటపాటు వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. స్థానికులు చెట్టుకొమ్మలను తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లో మోస్తరు వర్షం పడింది. ప్రజలు వర్షం కురువడంతో ఉపశమనం పొందారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగనాయుడు

ప్యాపిలి: డోన్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పీఆర్‌పల్లె, గుడిపాడు, మాన్‌దొడ్డి, పోతుదొడ్డి, వెంగళాంపల్లి, రంగాపురం, మెట్టుపల్లె, ఏనుగుమర్రి తదితర గ్రామాల్లో శనివారం సీపీఐ నాయకులు ప్రజాజాత నిర్వహించారు. అనంతరం ప్యాపిలిలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. డోన్ ప్రాంత అభివృద్ధికి, రైతు ప్రయోజనాల కోసం హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని చెరువులను త్వరితగతిన నింపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలో ప్రధాన రహదారి అయిన పాతబస్టాండ్ – రైల్వేస్టేషన రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.2.8కోట్లతో కిలో మీటర్ మేర నిర్మిస్తున్న ఈ రహదారి పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ ఇతేష్ పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మూడు రోజుల్లో ఈ రోడ్డు నిర్మాణం పనులను పూర్తవుతాయన్నారు. పాదచారుల సౌకర్యార్థం రోడ్డుకు ఇరువైపులా పుట్‌పాత్‌లతో పాటు లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో 60 అడుగుల వెడల్పుతో రోడ్డును సుందరంగా నిర్మిస్తున్నామని చెప్పారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణం చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శనివారం పట్టణ శివారులోని జగన్న కాలనీలో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలతో పాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాధిక, ఆర్ఐ ఇమ్రాన్, హౌసింగ్ ఏఈ సుదర్శన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓటు నమోదును సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అవుకు: ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బచ్చు శ్రీనివాసులు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండలంలోని బీఎల్ఓలతో డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబుతో కలిసి తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. బీఎల్ఓలకు ఓటు నమోదుపై సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఓటు నమోదు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు కార్డులో పేరు, అడ్రస్, పుట్టిన తేదీ తదితర తప్పులు సవరించుకోవాలన్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కు వయసు వచ్చిన వారు కూడా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరు కార్డు ఉన్న వ్యక్తి మరణించినట్లైతే కుటుంబ సభ్యుల నుంచి ధ్రువీకరిస్తున్నట్లు సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఓటరు కార్డు ఉన్న వ్యక్తి ప్రస్తుతం స్థానికంగా ఉంటున్నాడా... లేదా అనే విషయాలను పరిశీలించాలని బీఎల్ఓలకు సూచించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లకు పురస్కారాన్ని అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్

డోన్ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇళ్ల వద్దకే అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని మున్సిపల్ వైఎస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ పేర్కొన్నారు. పట్టణంలోని నాల్గవ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిన సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను వలంటీర్లకు హరికిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రజల మన్ననలు పొందుతున్నారని, మరింత మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి, కౌన్సిలర్ కటికె వేణు, సచివాలయ కన్వీనర్ మేడా రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

డోన్ టౌన్: సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అభిమానులు రక్తం దానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు మంగళి నగేష్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

నేటి నుంచి శ్రీవిష్ణుసహస్ర నామస్తోత్ర పారాయణం

బేతంచెర్ల: స్థానిక పూదోట మఠంలో లోక కళ్యాణార్థం 21వ తేదీ నుంచి జూన్ 30 వరకు శ్రీవిష్ణు సహస్రనామస్తోత్ర సామూహిక పారాయణం జరుగనుంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ పూదోట ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు గుండా గోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, రామకృష్ణ, డాక్టర్ నరసింహులు, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ. 6,74,050

బేతంచెర్ల : మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు తరలివచ్చారు. వేకువ జాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లడ్డు ప్రసాదం, కళ్యాణ కట్ట, వివిధ రకాల సేవల ద్వారా రూ.6.74.050 ఆదాయం సమకూరినట్లు ఈఓ పాండురంగారెడ్డి చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. అలాగే కోయిలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన రిటైర్డ్ టీచర్ గొర్రెడ్డి మద్దిలేటి రెడ్డి, నాగలక్ష్మమ్మ దంపతులు కూతుళ్లు, అల్లుళ్లు స్వామివారి ఆలయ పుననిర్మాణానికి రూ.1,11,116 విరాళంగా అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. దాదాపు 75 మంది పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు చాలా కాలం తర్వాత ఒకే చోట కలుసుకోవడంతో పాఠశాలలో సందడి నెలకొంది. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదుల్లో కలియతిరిగి నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నాటి హెచ్ఎం విశ్వేశ్వర, ప్రస్తుత హెచ్ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు బుసప్ప, దేవేంద్రప్ప, మాణిక్యం శెట్టి, సర్వజ్ఞమూర్తి, మౌలాలి, సునీల్, శంకర్ రెడ్డి, బాలకృష్ణ, సంజీవ్, శ్యామల తదితరులను సత్కరించి జ్ఞాపికలను అందేజేశారు.

రూ.2.25లక్షలతో సరస్వతీ మందిరం నిర్మాణం

విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో తమ గుర్తుగా పూర్వ విద్యార్థులు సరస్వతీ మందిరాన్ని నిర్మించారు. పాఠశాల ప్రాంగణంలో రూ. 2,25,000 వెచ్చించి అత్యంత సుందరంగా నిర్మించిన ఈ ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సరస్వతీ మాత కటాక్షం ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వవిద్యార్థులు తెలిపారు.